ఇక వ్యవసాయం పండగే

- రైతులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం
- సబ్సిడీపై రూ.1.94 కోట్ల విలువైన యాంత్రీకరణ పరికరాలు అందజేత
- ఆర్‌బీకేల ద్వారా మెరుగైన సేవలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

తుని రూరల్: రైతులు వ్యవసాయం చేసేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. సాగుదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, రాయితీలు భరోసా ఇస్తున్నాయి. రైతులకు పెట్టుబడి సాయం నుంచి సబ్సిడీపై ట్రాక్టర్లు, యంత్ర పరికరాలు (పనిముట్లు), విత్తనాలు, ఎరువులు అందిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పంట కాలంలోనే నష్ట పరిహారం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోంది. గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయం దండగా అని రైతులు భావించేవారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వ్యవసాయం లాభసాటిగా మారింది. పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తుండడంతో ధైర్యంగా సాగు చేస్తున్నామని పలువురు రైతులు చెబుతున్నారు.

పెట్టుబడి సాయం

గతంలో రైతులు వ్యవసాయ పెట్టుబడి కోసం దళారులను ఆశ్రయించేవారు. అప్పులతో రైతులు ఖరీఫ్ సాగుకు సన్నద్ధమయ్యేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. రాష్ట్ర ప్రభుత్వమే పెట్టుబడి సాయంగా ఏటా రూ.13,500 చొప్పున రైతులు, కౌలుదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తోంది. తుని మండలంలో 2021 నుంచి 2023 వరకూ 36,293 మంది సాగుదారులకు రూ.49 కోట్లను ప్రభుత్వం అందించింది. వైఎస్సార్ యంత్ర సేవా పథకంలో సబ్సీడీపై ట్రాక్టర్లు, ఫవర్ టిల్లర్లు, బ్రస్ కట్టర్లు, రోటోవీటర్లను రైతులు పొందుతున్నారు. మూడేళ్లలో రూ.1,94,11,435 విలువ చేసే యాంత్రీకరణ పని ముట్లను ప్రభుత్వం సబ్సిడీపై రైతులకు అందించింది. ఇందులో ప్రభుత్వం అందించిన సబ్సిడీ రూ.68,559,657 (50 శాతం), రైతు వాటా రూ.12,55,177 (10 శాతం), 40 శాతం బ్యాంకు రుణంగా రూ.1,12,96,601 లభించింది. ఖరీఫ్, రబీ పంట కాలాల్లో రాయితీపై విత్తనాలు, ఎరువులను తమ సొంత గ్రామాల్లోనే రైతులు తీసుకుంటున్నారు.


టి.తిమ్మాపురం రైతు సంఘానికి వైఎస్సార్ యంత్ర సేవలో అందించిన ట్రాక్టర్‌తో రైతులు


వి.కొత్తూరులో సబ్సిడీపై పొందిన పవర్ టిల్లర్‌తో లబ్ధిదారుడు

50 శాతం రాయితీపై ట్రాక్టర్


మా గ్రూపు సభ్యులు తరఫున రూ.9.49 లక్షలతో ట్రాక్టర్ తీసుకున్నాం. దీనిలో పది శాతం రైతు వాటాగా చెల్లించాం. 50 శాతం సబ్సిడీని ప్రభుత్వం విడుదల చేసింది. మిగిలిన 40 శాతం బ్యాంకు నుంచి రుణం తీసుకుని విధిగా చెల్లిస్తున్నాం.
– గేదెల లోవరాజు, రైతు, వి.కొత్తూరు.

పవర్ టిల్లర్ తీసుకున్నాను


రూ.98 వేల విలువ చేసే పవర్ టిల్లర్‌ను 50 శాతం సబ్సిడీపై తీసుకున్నాను. పవర్ టిల్లర్‌తో వ్యవసాయ పనులు సులభంగా చేసుకుంటున్నాను. కూలీల కోసం ఎదురుచూడకుండా సొంతంగా కలుపు నివారణ, పంటలో సాల్లు తీసుకుంటున్నాను.
– కర్రి అప్పలనాయుడు, రైతు, వి.కొత్తూరు

ప్రతినెలా సమావేశాలు


మండల వ్యవసాయ సలహా మండలి సమావేశాలు ప్రతినెల విధిగా నిర్వహిస్తున్నాం. వైఎస్సార్ యంత్ర సేవ పథకంలో అవసరమైన రైతు సంఘాలు, వ్యక్తులకు సబ్సిడీపై యంత్రాలు మంజూరు చేస్తున్నాం. ఎన్ని సంఘాలకైనా వైఎస్సార్ యంత్ర సేవలో పనిముట్లు అందించేందుకు తీర్మానాలు చేస్తాం.
– చోద్రాజు రాంబాబురాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, తేటగుంట

ఆర్‌బీకేల్లో నమోదు చేసుకోవాలి


రైతులు, రైతు సంఘాలకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, యంత్ర పరికరాలను రైతు భరోసా కేంద్రాల్లో నేరుగా నమోదు చేసుకోవచ్చు. అలా నమోదు చేసుకున్న రైతులు, సంఘాలకు సబ్సిడీ మంజూరైన తర్వాత తమ వాటా చెల్లిస్తే, యాంత్రీకరణకు బ్యాంకు రుణాలను మంజూరు చేయిస్తున్నాం.
– బి.అశోక్‌కుమార్, ఏఓ, తుని మండలం

క్లుప్తంగా

విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ


ప్రత్తిపాడులో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న శ్రీనివాసరెడ్డి

ప్రత్తిపాడు: పేద విద్యార్థులకు సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని శ్రీషిర్డీసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం వద్ద శనివారం ఎస్ఎంఎస్ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. ఎస్ఎంఎస్ ప్రతినిధులు గొందేసి సత్యానందం, గొండేల లక్ష్మి తదితులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

ఏలేశ్వరం: విద్యార్థులు సన్మార్గంలో పయనించాలని అమలాపురం ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం సిస్టర్ స్వరూపాదేవి సూచించారు. యర్రవరంలోని విజ్ఞాన జ్యోతి డిగ్రీ కళాశాలలో శనివారం కేంద్ర వై 20 క్రీడలు, యువజన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్వరూపాదేవి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు మానసిక వికాసం, ఆధ్యాత్మిక మార్గాలపై దృష్టి సారించాలన్నారు. మొబైల్ ఫోన్ల వాడకం తగ్గించి చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీవీవీ రమణ, రాజేష్, కొల్లా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు లిఫ్టును పరిశీలించిన అధికారులు


తాళ్లూరు లిఫ్టును పరిశీలిస్తున్న అధికారులు

గండేపల్లి: మండలంలోని తాళ్లూరు పుష్కర ఎత్తిపోతల పథకాన్ని శనివారం అధికారులు పరిశీలించారు. మరమ్మతులు నిమిత్తం సీఎస్ఆర్ నిధులు రూ.22 లక్షల విడుదలయ్యాయని తెలిపారు. మరమ్మతులు చేసి త్వరలో నీటిని విడుదల చేస్తామన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఎన్. విజయ్‌కుమార్, ఏడీఏ వైవీ గంగాధర్ కుమార్, పుష్కర ఏఈఈ వై.జగదీష్, తహసీల్దార్ వీవీ సత్యనారాయణ, వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి, సర్వేయర్ డీటీ ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైన్లలో పూడిక తొలగించాలంటూ ధర్నా


పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కిర్లంపూడి: డ్రైన్లలో పేరుకుపోయిన పూడిక తొలగించాలని కోరుతూ ఏపీఆర్‌సీఎస్ కార్యదర్శి కడితి సతీష్ ఆధ్వర్యంలో శనివారం బూరుగుపూడి పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ బూరుగుపూడిలోని 6, 7, 8 వార్డుల డ్రైన్లలో పూడిక పేరుకుపోయి మురుగు ముందుకు పారడం లేదన్నారు. డ్రైనేజీల్లోని మురికి నీరు ఇళ్ల మధ్య నిలిచిపోతోందన్నారు. దీంతో దోమలు పేరుకుపోయి అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శి ఎన్‌టీ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు.

విస్తృతంగా ఎస్ఈబీ దాడులు

ప్రత్తిపాడు: జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, ఎస్ఈబీ జాయింట్ డైరెక్టర్ ప్రేమ్‌కాజల్ ఆదేశాల మేరకు గ్రామాల్లోని సారా స్థావరాలపై శనివారం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బంది దాడులు నిర్వహించారు. ప్రత్తిపాడు మండలంలోని ఉత్తరకంచిలో సారా తయారీకి సిద్ధం చేసిన 500 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. ఉత్తరకంచి గ్రామానికి చెందిన విత్తనాల శివపై కేసు నమోదు చేశారు. కేతనగిరి గిరిజన తండాలో 400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, కె.మిర్తివాడకు చెందిన పూజల లోవమ్మ, భూముల సత్యవతిపై కేసులు నమోదు చేశారు. ఈ దాడుల్లో కాకినాడ ఎస్ఈబీ సీఐ పి.సునీల్‌కుమార్, ఇంటిలిజెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.గిరిధర్, టాస్క్‌ఫోర్స్ సీఐ జె.విజయ్‌కుమార్, ప్రత్తిపాడు ఎస్సై ఎం. పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్టు

మండలంలోని పోతులూరులో సారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు. పోతులూరుకు చెందిన ఇనకోటి రాజబాబును అదుపులోకి తీసుకుని అతని నుంచి 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వివరించారు.

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు


ఏలేశ్వరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎమ్మెల్యే పర్వతపూర్ణచంద్రప్రసాద్
- ఏలేశ్వరంలో గడపగడపకూ మన ప్రభుత్వం

ఏలేశ్వరం: తమ ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ అన్నారు. ఏలేశ్వరంలో శనివారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, అధికారులతో కలిసి ఎమ్మెల్యే 7వ వార్డులో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాలుగేళ్లలో 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేశారన్నారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, పైల విజయ్‌కుమార్, కడింశెట్టి వాసు, బోద చిరంజీవిరావు, తొండారపు రాంబాబు, వాగు బలరామ్, దిలబర్‌హుస్సేన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఐక్యతతో మెలగాలి

- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి
- ర్యాగింగ్ చట్టాలపై అవగాహన

గండేపల్లి: విద్యార్థులు ఐక్యతతో మెలగాలని పెద్దాపురం డీఎస్పీ కె.లతాకుమారి సూచించారు. మండలంలోని సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో విద్యార్థులకు శనివారం ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్‌కు వ్యతిరేకంగా నడుచుకోవాలన్నారు. తల్లిదండ్రుల కలలను నెరవేర్చి వారి పేరు నిలబెట్టాలన్నారు. విద్యార్థి దశలో కష్టపడి చదివితేనే భవిష్యత్ బాగుటుందని, ప్రతి విద్యార్థి ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. ర్యాగింగ్ వల్ల కలిగే నష్టాలు, చట్టాలపై అవగాహన కల్పించారు. అనంతరం ఆదిత కళాశాలల వైస్ చైర్మన్ ఎన్.సతీష్ రెడ్డి ముఖ్య అతిథులను శాలువాతో సత్కరించి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట సీఐ బి.సూర్య అప్పారావు, కళాశాల ప్రిన్సిపాల్ డోలా సంజయ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ కాపుల కల్యాణి, రమేష్ రాజా, తదితరులు పాల్గొన్నారు.


ర్యాగింగ్ చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ లతాకుమారి

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

రౌతులపూడి: గంజాయి, సారా వంటి మాదక ద్రవ్యాలు, పేకాట, గుండాట, కోడి పందేలు వంటి అసాంఘిక కార్యక్రమాలకు యువత దూరంగా ఉండాలని రౌతులపూడి ఎస్ఐ అబ్దుల్ నబీ సూచించారు. మండలంలోని గుమ్మరేగుల ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం వారధి కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు డ్రగ్స్ నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజలు పోలీసులతో మమేకం కావాలన్నారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై ప్రజలను చైతన్య పరిచారు. ప్రస్తుతం ఫేస్ బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలను ఉపయోగించుకుని కొందరు సైబర్ నేరాలకు పాల్పడుతున్నారన్నారు. అలాంటివారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాపర్తి రామకృష్ణ, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

డివైడర్‌పైకి దూసుకెళ్లిన ట్యాంకర్


జాతీయ రహదారిపై ప్రత్తిపాడు వద్ద డివైడర్‌పైకి దూసుకుపోయిన ట్యాంకర్

ప్రత్తిపాడు: పదహారో నంబర్ జాతీయ రహదారిపై ట్యాంకర్ అదుపు తప్పి, డివైడర్‌పైకి దూసుకుపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. వివరాల్లోకి వెళితే... జాతీయ రహదారిపై ముంబాయి నుంచి నక్కపల్లికి స్టైరీన్ మోనోమర్ ద్రావణాన్ని తీసుకువెళ్తున్న ట్యాంకర్ స్థానిక మినర్వా పాఠశాల సమీపానికి వచ్చే సరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో అదుపు తప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

సెర్ప్ సీఈఓను కలిసిన యానిమేటర్లు


గోకవరంలో సెర్ప్ సీఈఓ ఇంతియాజ్‌ను కలిసిన డ్వాక్రా యానిమేటర్లు

గోకవరం: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమ వేతనం రూ.3 నుంచి రూ.10 వేలకు పెంచి తమకు మరింత గౌరవం పెంచారని డ్వాక్రా యానిమేటర్లు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం మండలానికి వచ్చిన సెర్ప్ సీఈఓ ఎండీ ఇంతియాజ్, స్త్రీనిధి మేనేజింగ్ డైరెక్టర్ కేవీ నాంచారయ్యను ఏఐటీయూసీ డ్వాక్రా యానిమేటర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యానిమేటర్లు మాట్లాడుతూ వీవోఏలకు ఉద్యోగ భద్రత, అర్హత ఉన్న వారికి పదోన్నతులు, ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని వినతి పత్రాలు సమర్పించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కందికట్ల కనకరత్నకుమారి, అల్లాడి సౌందర్య జ్యుయల్, ఎం.దుర్గ, బి.మీరాబాయి, వసంత, కాశీ విశాలక్ష్మి, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులకు నోటిఫికేషన్

ప్రత్తిపాడు: మండలంలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు స్థానిక ఐసీడీఎస్ సీడీపీఓ ఆర్‌వీఎస్ లక్ష్మి శనివారం తెలిపారు. ప్రత్తిపాడు మండలం పెదశంకర్లపూడి 3వ అంగన్‌వాడీ కేంద్రలో హెల్పర్ పోస్టును బీసీ–ఎకు, ధర్మవరం 1వ అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్ పోస్టును ఓసీ (వితంతువు)కు కేటాయించారు. 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండి, స్థానిక వివాహిత మహిళలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ నెల 19వ తేదీలోగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని సూచించారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


ఏలేశ్వరం బాలాజీ చౌక్ ఆలయంలో పారాయణ చేస్తున్న మహిళలు

ఏలేశ్వరం: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ఆలయాల్లో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బాలాజీచౌక్ వద్ద విశ్వహిందూ పరిషత్ అనుబంధ మాతృశక్తి, దుర్గా వాహిని మహిళా సంఘాల ఆధ్వర్యంలో భగవద్గీత ప్రవచనం, విష్ణుసహస్ర, లలితాసహస్ర నామ పారాయణలు చేశారు. అనంతరం భక్తిగీతాలు ఆలపించారు. చినజీయర్ స్వామి శిష్యురాలు వాగు రోహిణి భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తివైభవం, విష్ణు వైభవంపై ప్రవచనాలు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రతినిధులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరిటీ, ఉడతల రమణారావు, తూమురౌతు గురయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల అభ్యున్నతికి కృషి


జగ్గంపేటలో జాన్ వెస్లీని సత్కరిస్తున్న నాయకులు

జగ్గంపేట: నియోజకవర్గంలోని క్రైస్తవుల అభ్యున్నతికి కృషి చేస్తానని రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ అన్నారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో రిపబ్లికన్ పార్టీ ఆఫ్ సౌత్ ఇండియా నాయకుడు పులి ప్రసాద్ ఆధ్వర్యంలో యునైటెడ్ పాస్టర్స్ పెలోషిప్ నాయకులు శనివారం జాన్ వెస్లీని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ జాన్ వెస్లీ జగ్గంపేటకో ఆప్షన్ మెంబర్‌గా, క్రిస్టియన్ మైనారిటీ జోనల్ ఇంచార్జిగా, క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఉన్నత పదవులు అలంకరించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.జార్జిబాబు, పాస్టర్స్ కుమార్ పాల్, ఐ.సుదర్శన్, దళిత నాయకులు వల్లూరి సత్యానందం, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు విధిగా పాటించాలి


గోకవరంలో పెట్రోల్ బంక్‌లో తనిఖీలు చేస్తున్న ఎస్సై శివనాగబాబు

గోకవరం: ఫైర్ సేఫ్టీకి సంబంధించి ప్రభుత్వ నిబంధనలు విధిగా పాటించాలని ఎస్సై శివనాగబాబు సూచించారు. మండలంలోని పెట్రోల్ బంక్‌లు, మందుగుండు సామగ్రి తయారీ కేంద్రాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు లోబడి మందుగుండు సామగ్రి తయారు చేయాలన్నారు. పెట్రోల్ బంకుల్లో ఫైర్ సెఫ్టీ పటిష్టంగా ఉండాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైనా బాణసంచా తయారు చేసినా, నిల్వ ఉంచిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్సై శివనాగబాబు హెచ్చరించారు.

అమరవీరుల త్యాగాలు మరువలేం

- గ్రామాల్లో ఉత్సాహంగా నా భూమి–నా దేశం
- మొక్కలు నాటిన ప్రజాప్రతినిధులు, అధికారులు

శంఖవరం: దేశం కోసం ప్రాణత్యాగం చేసిన స్వాతంత్ర్య సమరయోధులు, అమర వీరుల త్యాగాలను మరువలేమని ఎంపీపీ పర్వత రాజుబాబు అన్నారు. శంఖవరంలో శనివారం ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. నా భూమి–నా దేశం శిలా ఫలకాన్ని ఆవిష్కరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ బందిలి గనియమ్మ, ఎంపీటీసీలు గెడ్డం రాణి, పులి సత్యవతి, పంచాయతీ కార్యదర్శి శ్రీరామమూర్తి పాల్గొన్నారు.

కోటనందూరు: మండలంలోని ఎల్లీ పేట, కోటనందూరు, జగన్నాథపురం గ్రామాల్లో శనివారం నా మట్టి–నా దేశం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ శివార్లలోని చెరువుల వద్ద అమరవీరుల శిలాఫలకాలు ఏర్పాటు చేసి ప్రాణప్రతిజ్ఞ చేశారు. కోటనందూరు నల్ల చెరువు వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎంపీపీ లగుడు శ్రీనివాసు, సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ చేసారు. తుని మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, ఉల్లూరి శ్రీను, ఎంపీడీఓ సుబ్రహ్మణ్య శర్మ, ఉపాధి ఏపీఓ రామచంద్రరావు పాల్గొన్నారు.


శంఖవరంలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పర్వత రాజుబాబు

ఉత్సాహంగా నా భూమి–నాదేశం

రౌతులపూడి: మండలంలోని ఎస్.పైడిపాల, మల్లంపేట, గుమ్మరేగుల, ఉప్పంపాలెం, గిడజాం, జల్దాం గ్రామాల్లో శనివారం నా భూమి–నాదేశం, నేలతల్లికి నమస్కారం–వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు మట్టిని సేకరించి గ్రామాల్లో ర్యాలీ చేశారు. ఎస్.పైడిపాల, మల్లంపేట గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వాతంత్ర్య వీరులకు వందనం చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రతి జ్ఞచేసి మొక్కలు నాటారు.


జగ్గంపేటలో వృద్ధులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

కిర్లంపూడి: మండలంలోని బూరుగుపూడి, సోమవరం, కృష్ణవరం, సింహాద్రిపురం, రామకృష్ణపురం గ్రామాల్లో శనివారం నా భూమి–నా దేశం, నేలతల్లికి నమస్కారం కార్యక్రమాలు నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిజ్ఞ చేసి ప్రభుత్వ కార్యాలయాల వద్ద, చెరువు గట్లపై కొబ్బరి మొక్కలు నాటారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని పెద్దిపాలెం, శరభవరం, బవురువాక గ్రామాల్లో శనివారం నా భూమి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు గ్రామాల్లో మొక్కలు నాటారు.


ఎస్.పైడిపాలలో మొక్క నాటుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం

జగ్గంపేట: గ్రామంలో శనివారం నా మట్టి–నా దేశం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా ముఖ్య అతిథిగా పాల్గొని నా మట్టి–నా దేశం కార్యక్రమం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం వృద్ధులను సత్కరించారు. సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు.

గుమ్మరేగుల మాజీ సర్పంచ్ మృతి

రౌతులపూడి: మండలంలోని ఉప్పంపాలెం గ్రామానికి చెందిన గుమ్మరేగుల మాజీ సర్పంచ్ నాగం రామకృష్ణబాబు (74) శనివారం మృతి చెందారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన తుదిశ్వాస విడిచారు. రామకృష్ణబాబు 2001 నుంచి 2006 వరకూ గుమ్మరేగల గ్రామ సర్పంచ్‌గా పనిచేశారు. ఈయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. రామకృష్ణబాబు మృతిపై పలువురు నాయకులు సంతాపం తెలిపారు.

దోమల నివారణ ప్రత్యేక చర్యలు

కరప: సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా మండల పరిధిలోని గ్రామాల్లో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఈఓ పీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు తెలిపారు. శనివారం సాయంత్రం కరప, నడకుదురు తదితర గ్రామాల్లో మోటార్ పంపుల ద్వారా దోమల మందును పిచికారీ చేయించారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు సాదే ఆశాజ్యోతి, దేగల లలితకుమారి, కార్యదర్శులు ఎస్‌కే నాగేంద్ర కుమార్, పీఎస్ఆర్ బ్రహ్మానందం, వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్ కుమార్ తదితరులు దోమల నివారణకు చేపట్టిన మందుల పిచికారీని పర్యవేక్షించారు.